కోపంపోలేదు. తలుచుకున్నప్పుడల్లా నాకు మండిపోతోంది? యింతలో ఆమె సొమ్మసిల్లిపోయింది? అనే భావం వదలదు. పడవ ఆగింది. దూకేశి వెళ్ళిపోయినాను' వూళ్ళోకి. వూరిపేరన్నా యెవర్నీ అడగలేదు. ఆమా? ఆమె యేమయిందో! రెవికా, చీరా, లేదంటావా? నే నేంచెయ్యను?

---

# ౬. మచ్చలు

పోలీసు సబ్ ఇన్స్పెక్టరు భవానిరావు 'డ్యూటీ'మీద వెడుతోవుంటే, నేను వెళ్లాను. బ్రాహ్మణ వీధులలో చిన్న పురాతనపు పెంకుటిల్లది. దాని ముందు పెద్ద గుంపు పోగయింది. పోలీసు జవాను అడ్డం నుంచుని ఎవర్నీ లోపలికి పోనివ్వటంలేదు. మే మిద్దరమూ నడవాలోంచి లోపలికి వెళ్లాము. కిటికీకింద మూలనున్న పెద్ద నవారు మంచంమీద ఆపిల్ల శవం పడివుంది. మాసిపోయిన చంగావి చీరా, నల్లని రెవికా రక్తంతో తడిసి వున్నాయి. మెడకింద వాడు పళ్లతో చీల్చిన గాయం కనపడుతోంది. ఎదిగినవాళ్ల కెవరికీ అంత చిన్న పిల్లను నే నెన్నడూ చూడలేదు. ఆ అమాయకమూ, విశ్వాసమూ, ఆశ్చర్యమూ, కళ్లు మూతలుపడివున్న, ఆచిన్న పెదవి వొంపులో, ఆ గడ్డం కొనలో, ఆ కనుబొమ్మలు కలుసుకోడంలో నాకు కనపడ్డాయి. నిద్దట్లో భయమేసి యేడుస్తున్నట్టే ముద్దుగా జాలిగావుంది. భవానిరావు 'నోట్సు' తీసుకుంటున్నాడు. నన్ను బాధించే జాలిని భరించలేక బైటికి వెళ్లాను.

అరుగుమీద కూచున్న ఒక కుర్రాడి చూపు నన్నతని వేపు కనిపెట్టి చూసేట్టు చేసింది. అతని మొహంలో విచారమూ, నిరాశా, ద్వేషమూ చెప్పలేనంత గాఢంగా కనబడుతున్నాయి.

"ఎవరు నువ్వు ?"

నా మాట నిర్లక్ష్యంచేసి

"వాణ్ణేం చేస్తారండీ?" అన్నాడు.

నడవాలో కూచున్న ఖైదీవంక చూశాను. అక్కడ జరిగే వ్యవహారమంతా తనకేమీ సంబంధం లేనట్టూ, తనేదో తన తపస్సులోనో యోగంలోనో వున్నట్టు కూచుని వున్నాడు.

"మీరు పోలీసులేగావును. అందుకని అడిగాను. అయినా వాణ్ణేంచేస్తేమాత్రం మీకేం పట్టింది. మీపని మీరు చేసుకు వెడతారు."

అని వూరుకున్నాడు. అతని మాటల్లో బాధా అణుచుకుంటున్నటువంటి మహావిచారమూ, చూసి ఆశ్చర్య పోతో నుంచున్నాను. మళ్లీ అతను

"వాణ్ణేదో చేస్తారు తప్పదు. ఉరి తీస్తారేమో! కాని వాణ్ణిప్పుడేంచేసి ఏంలాభం? పోయినప్రాణం, మధురమైనదీ, అమాయకమైనదీ. ఆప్రాణం తిరిగిరాదుకదా, ఆమెమళ్ళీ మెల్లిగా, దీనంగా, నడుస్తో, బెదిరిబెదిరి చూస్తో, యింకకన పడదుకదా? ఎవరన్నా ఒకరు దయగలవారు తనకోసం అను కంపపడేవాళ్లు ఈ లోకంలో వున్నారా అని వెతికివెతికి, కన పడక, నిరాశపడి, పరలోకాన్ని వెదకబోయింది. ఇప్పుడు- అంతా మిగిలిపోయింతరవాత, అందరూ కనికరం చూపేవారే!

అన్యాయం జరిగిందనేవాళ్ళే! కాని ఆ రేళ్ళనించి వాళ్ల కళ్ళముందే యీ హత్య జరుగుతోవుంటే, వొక్కడూ— వొక్క ఆడది—ఒక్క దయగలమాట మాట్లాడినవాళ్లు లేరు. శవంమీద వున్న కరుణ వీళ్ళకి మనుషులమీద వుండదు. మీ రందరూ యిప్పుడు—హత్య జరిగింతరవాత వొస్తారు, ఘనుల మని—ఏం చేస్తోందో యీ పోలీసుసిబ్బంది అంతా యిన్ని రోజులూ! బతికివున్నప్పుడు కాపాడేందుకు ఒక్కరూ కన పడరు. శవంచుట్టూ రాంబందుల్లాగు వాల్తారయ్యా! ఇదంతా వాణ్ణి వురితీసేందుకు, యీ అట్టహాసం! ఏం లాభం? ఏం న్యాయం? ఆ పిచ్చివాణ్ణి చంపి? వాడి కేం తెలుసు?" అన్నాడు.

"వాడికి పిచ్చా?"

"పిచ్చా! ఏమో! నాకు తెలీదు. మీడాక్టర్నడగండి" నేనింకా అడగ బోతుండగా, చివాలునలేచిగుంపు వెనక్కి పోయి మాయమైనాడు.

ఆవాళ్ళ సాయత్రం కాలవవొడ్డున చాలాదూరం షికారు వెళ్ళి యింటికి తిరిగివస్తున్నాను. ఆకలివేస్తోంది. వంటవి సిద్ధం గానే వుంటుంది గాని, యిల్లుచేరగానే మెతుకులురావు. కాళ్లు కడుక్కొని, మడిపంచకట్టి, సంధ్యవార్చినట్టు నటిస్తేనేకాని, మాఅత్త అన్నంగిన్నె చాయకుపోదు. నాఅదృష్టం కొద్దీ, యేమేనమామ సవితితల్లి మరది తమ్ముడో నామీద ప్రేమ చాత వొచ్చిమడిగట్టి ముక్కుమూశాడంటే, పదిగంటల కన్నా తిండి దొరికితే. అదేమి ప్రారబ్ధమో మాయింటికి వొచ్చిన అతిథు లందరికీ, మొదట ఆచారమూ, భక్తి, అధిక

మూతాయి. రెండోది ఆకలి మందగిస్తుంది. కాని భోజన తత్పూర్వమే ఆనందం, భోజనప్రారంభములోనే ఆనందం మాయమై, చప్పున మొదట ఆజ్యధారతోనే జఠరాగ్ని భగ్గుమని, సమస్త పదార్థాలనీ ఆహుతి చేస్తుంది, నాకు మారు వడ్డనకన్నా మిగలకుండా.

తదియ చంద్రవంక రక్తంతో తడిసిన వంకరకత్తిలాగు పడమట జారుతోంది. గాలి రివ్వున చెట్లనన్నిటిలోంచీ దూసుకు పోతోంది. కాలవ రెండోప్రక్కనున్న శ్మశానంలో శవం కాలిపోతోంది. ఎగరకొట్టే ఆగాలిలో నాలికలవలె అగ్నిజ్వాలలు చితిమీదనించి లేచి, పక్కనున్న నలుగురు మనుషులనికూడా అందుకోవాలని చూస్తున్నాయి. ఆపిల్ల శవమే అయివుంటుంది. పొద్దున్న నేనుచూసిన, ముడతలు లేని ఆచిన్ననుదురూ, ఏడుస్తున్న ఆపసిబిడ్డనోరూ యింక లోకంలో యెవరికి ఎన్నటికీ కనపడవు. అంతఅందంగా, హృదయాన్ని కరిగించేట్టు అట్లాంటి చూపుని, మెత్తదనాన్ని అందాన్ని కల్పించి యిట్లా నిర్లక్ష్యంగా నాశనం చెయ్యడంలో యీసృష్టి వుద్దేశ్యమేమిటో? లోకాన్ని మిరుమిట్లు గొలిపిన సౌందర్యవతులు అహల్య, ట్రాయ్ హెలెన్, క్లియోపాట్రా, ద్రౌపది, నూర్జహాన్, వీళ్ళందరి సౌందర్యమూ, యిట్లానే కాలిపోయింది, చీకిపోయింది, మన్నూ బూడిదా అయింది. ఎందుకో అట్లా! ఈశ్వరుడే సుందరుడూ, ఆనందమయుడూ ఐతే, లోకమంతా యిన్ని వికారరూపాలెందుకో, రూపాలేకాదు- మనసులు, ఆత్మలూ-అన్నీ అవే-ఎక్కడో ఒక్క సుందరమైన ముఖమూ-దృష్టి, హృదయమూవుంటే, అవి యిట్లా నలిగి, చిరిగి,

నాశనమౌతాయి. నాగుండెల్లో చెప్పలేని దిగులు ప్రారంభించింది.

కాలవపక్కన కూచున్నాడు ఎవడో! ఏడుస్తున్నాడు. ఆగాను. ఆ సన్నని వెన్నెల ఒకవేపూ, ఆచితిమీది ఎర్రని వెలుగు రెండోవేపు ముఖంమీద పడుతోంది. వెర్రిచూపు. వొళ్లంతా తడిసింది. వెక్కి వెక్కి యేడుస్తున్నాడు, పొద్దున్నటి కుర్రాడు. నాశవంకూడా ఆవిధంగా తగలపడేరోజు నాకళ్ళ యెదట భావించుకుంటున్న నాకు ఆసమయంలో నాదురభిమానమూ, అధికార గర్వమూ, విద్యాధిక్యతా అన్నీపోయి, సమస్తజీవరాసులతోటీ సమానత్వం తటస్తించినట్టు తోచింది. ఆ అబ్బాయి దగ్గరికి వెళ్ళి, బుజంమీద చెయ్యేసి

"తమ్ముడూ! ఆబాధ యేమిటో నాతోటి చెప్పరాదూ?" అని దయగా అడిగాను. వెంటనే హృదయకుహరాలు విడిపోయినట్టు

"కాలిపోతోంది. పోతూంది కాలిపోతోంది." అని బిగ్గరిగా యేడ్చాడు. అతని చెయ్యి పట్టుకుని దూరంగా నడిపించుకుని తీసికెళ్ళాను. చంద్రుడస్తమించాడు. నక్కలు కూస్తున్నాయి. కాలవనీళ్ళు తూముకిందనుంచి 'లబలబ' శబ్దంచేస్తో పోతున్నాయి, చీకట్లో భయంలేక కీచురాళ్లు శబ్దంచేస్తున్నాయి.

"సంగతేమిటి? ఆపిల్లనీకు బంధువా? ఇట్లారహస్యంగా యెందుకేడుస్తావు?"

అప్పటికి పొల్లివాచ్చే విచారాధిక్యత తగ్గింది. కన్నీళ్లు తుడుచుకుంటో యీ కథచెప్పాడు. నా ఆకల్నీ, భార్యనీ,

మెంతిపెరుగునీ, కందిపచ్చడినీ, బంధువుల్నీ మరిచివిన్నాను-ఏ రాత్రిదాకానో-

"వాళ్లది బీదకుటుంబం. ఆ పిల్ల ప్రతిదినమూ మా యింటికి మజ్జిగకి వొచ్చేది నా భార్య ఆమెతో సాధారణంగా సరసాలాడుతో దయగా హేళనచేస్తో వుండేది. నేనూ అక్కడ వుండడం తటస్థించినప్పుడు తమాషాకి మాటలు కలిపి నవ్వేవాణ్ణి. ఆమె:చక్కని చిన్న నవ్వు నవ్వేది. ఆ నవ్వు చూడాలనే సరదాలో, ఏదో వొకటిచెప్పి నవ్విస్తాను. ఒకరోజు ఆమె బుగ్గమీద పెద్ద మచ్చతో మా యింటికి వొచ్చింది. నా భార్య అదేమిటని అడిగితే, సిగ్గుతో, మాట తడబడపడి, మంచంకోడు తగిలిందని చెప్పి తప్పించుకోవాలని చూసింది. నా భార్య వదలక ఏమిటో చెప్పమని ఆ మచ్చని పట్టుకు పరియాచకాలాడుతోంది. నేను వెళ్లాను.

"దుర్గమ్మా—"

ఆ పిల్లపేరు దుర్గమ్మ.

"దుర్గమ్మా, వారంరోజులకిందట దీని బుజంమీద ఎర్రనిమచ్చ వొకటిపడ్డది. నీళ్ళుపోస్తో వీళ్ల అమ్మ అదేమిటేలని అడిగింది కూడాను. అదెట్లా వొచ్చిందో అడుగు" అన్నాను.

నా భార్య "మరీ అట్లానా ?" అని పెద్ద నవ్వు నవ్వింది. దుర్గమ్మ బుగ్గచూసి. దుర్గమ్మ వుడుకుకుని, కళ్ళనీళ్ళు కుక్కుకుంటో, మజ్జిగ తీసుకోకుండానే వెళ్ళిపోయింది.

తరవాత—ఆ రోజు అట్లతద్దిరోజున—నా భార్య ఆ పిల్లని వుయ్యాలమీద కోచోపెట్టి వూపిస్తో నడుందగ్గిర పట్టుకునేటప్పటికి నెప్పి అని అరిచింది ఆ పిల్ల. రెండు మూడు సార్లు

అట్లానే జరిగేటప్పటికి అందరు పిల్లలూ చేరి ఏమిటో చూపమన్నారు. ఏమో కుడుపులనీ, దెబ్బలనీ చెప్పితే నమ్మక చీరె బలవంతంగా తొలిగించి చూశారు. ఎర్రని పెద్ద మచ్చ కనపడ్డదని నా భార్య చెప్పి ఒక్కటే నవ్వింది.

కొన్నాళ్ళ తరవాత నాలుగురోజులు మజ్జిగకి రాలేదు. ఏమో అనుకున్నాము. భావిదగ్గిర నా భార్యకి తలకి కట్టుకట్టుకుని దుర్గమ్మ కనపడి, పిలిచినా రాకండా వెళ్ళిపోయింది. రెండు రోజుల తరవాత ఆ కట్టుతో వొచ్చింది. మామూలుగా!

"రావటంలేదేం? దుర్గమ్మా!" అన్నాను.

నవ్వి "కట్టు కట్టుకున్నానుగా!"

తమాషాకి కట్టుకుం దనుకున్నాను.

"మరి విప్పందే వొచ్చావేం?"

"విప్పిందాకా వుంటే, మజ్జిగ లేక యీలోపున కాకచేసి చస్తామని భయమేసింది. అదిగాక అన్నంలోకి యింకేం గతిలేదు."

"ఆ కట్టు తియ్యి"

"అమ్మో! ఆశే!"

"ఏముంది?"

"గత్నాలన్నీ వొలికిపోవూ?"

"నేను రెండేరుకుంటాను."

అని చప్పున కట్టు లాగేశాను. బిత్తరపోయింది ఆ మనిషి. రెండు బుగ్గలమీదా, రెండువరసలు పళ్లు దిగపడ్డ గంట్లువున్నాయి. కళ్లవెంట నీళ్లు పెట్టుకుంటో కొంగు ముఖం మీద కప్పుకుని దుర్గమ్మ పారిపోయింది. ఆ గాయంచూస్తే

నాకు భయం జాలి, ఆశ్చర్యం, యిన్నికలిగాయి. పొద్దున్న చూశాలా, వాడే రత్తయ్య, ఆమె మొగుడు. వాణ్ణి నేను మొదటినించీ యెరుగుదును. చిన్నప్పుడు వాణ్ణి పిచ్చిరత్తయ్య అనేవాళ్ళం. ముంగి. చిన్నప్పుడుకూడా, ఆటలాడినా, పన్నేసినా, గంతులెయ్యడు. గుడ్డగూబలాగు చూస్తూకూర్చుంటాడు. వాణ్ణి చూస్తే అందరికీ అసహ్యం. ఏదో ముంగిగా కనపడేవాడు. పెద్దయినాక మేమెవరం వాడితో మాట్లాడ్డం మానేశాము. వాడూ ఒకరితో మాట్లాడడు, ఒకరి జోలికిపోడు. పనిచెయ్యడు. అట్లాకూచుంటాడు చుట్టకాలుస్తో.

వాడిప్రకారం, ఆపిల్లలాగుండే నమ్మను. ముంగును బాధించాలా అని ఆలోచించాను. వాడేనా? వాడుకాక యింకెవడు? దుర్గమ్మవంటి భార్యవుండటం [illegible]. అతనికి క్రోధం తెప్పిస్తుందని అనుకోడం కూడా పొరపాటైన విషయం. దుర్గమ్మనే అడుగుదామనుకున్నాను. కాని యింత వరకు నాభార్య వెనకనుంచుని పలికించాలేగాని, ఎన్నడూ నేనాపిల్లతో సరిగా మాట్లాడలేదు. అందుకని నాభార్యనే అడగమన్నాను.

ఒకరోజు దుర్గమ్మతండ్రి వాళ్ళవూరునించి దుర్గమ్మని చూడ్డానికివొచ్చి, మానాన్నగారి దగ్గిరికి వొచ్చాడని తెలిసింది, మానాన్నగారు మునసబూ, ఆవూరికి పెద్దా. ఆయన మానాన్న గారితో, తన కూతురికి పుట్టింటికి రానీయని వున్నాడనీ, రత్తయ్య పంపడంలేదనీ చెప్పుకుని యేడ్చాట్ట. తరవాత వారంరోజుల్లో రత్తయ్య పెళ్ళాన్ని కొడుతున్నాడని పుకారు పడ్డది. నాకెందుకో ఆపిల్లసంగతి మొదటినుంచీ నాస్వంత

వ్యవహారంగా కనపడేది. పుకారు ప్రబలమయింది. నాకు దుర్గమ్మ కనపట్టంలేదు. నాకూ జాలివేసి ఆపుకారు యెట్లా వొచ్చిందని విచారిస్తే, రత్తయ్య యింటిపక్కనవున్న నాగన్న పుట్టించాడని తెలిసి వాణ్ణి దబాయించాను. వాడు రుజువు చేస్తున్నాడు. మర్నాడు తెల్లారకట్ట వొచ్చి, నన్ను లేపి రత్తయ్య యింటిపక్కన నుంచోపెట్టాడు. లోపల్నించి జాలిగా మూలుగు వినపడుతోంది. క్రమంగా పెద్దదై యేడుపుగా మారింది. కాని కోపంతో కేకలు లేవు. మళ్లీవిన్నాను. నేనో విధంగా అర్థంచేసుకున్నాను. పట్టరాని నవ్వువొచ్చింది నాగయ్య యేమిటంటాడు.

"ఏమిటా ? అది కొట్టడంరా ? నీ మొహం ? నీకూ పెళ్లిగానీ ఆ మూలుగు అర్థమౌతుంది. ఇట్లాంటి వెధవపుకార్లు పుట్టించకు. తన్నేను." అని వాణ్ణో తోపుతోసి యింటికి వొచ్చి నిద్రపోయినాను. కాని దుర్గమ్మ వొంటిమీద చూసిన గాయాలూ, ఆపిల్ల కళ్లల్లో చూసిన బాధా నా మనసుని కలవర పెట్టి, ప్రశ్న లడుగుతోనే వున్నాయి.

వారంరోజుల్లో దుర్గమ్మ మా యింటికి వొచ్చింది. అన్నాళ్ళు ఎందుకురాలేదంటే జవాబు చెప్పలేదు. అప్పుడు నేనూ నా భార్యా కలిసి అడిగాము. "నిన్ను రత్తయ్య, కొడతాడా ?" అని. కొడుతోవుంటే, వాడు మానేటట్టు చేస్తానన్నాను. ఆ మాటలకి చెప్పరాని భయమూ, సిగ్గూ, కలిగి దుర్గమ్మ లేదు లేదని, ఏదో వికారంగా అని వూరుకుంది. ఎంత అడిగినా చెప్పలేదు. అటు తరవాత దుర్గమ్మని చూసినప్పుడల్లా నవ్వొచ్చేది. వాళ్లిద్దరి సరసాలూ అంత తీవ్రంగా

వుంటాయిగావును అనుకున్నాము. "ఏం దుర్గమ్మా ! ఎక్కడన్నా కొత్తమచ్చలు !" అని మొదట్లో నా భార్యా తరవాత నేనూ అనడం మామూలయింది.

నా భార్య ప్రసవానికని పుట్టింటికి వెళ్ళింది.

ఒక సాయంత్రం మా దొడ్లో దుర్గమ్మ గోంగూర కోసుకుంటూ వుండగా నేనక్కడికి వెళ్ళడం తటస్థించింది. దడి దగ్గిరిగా తెల్లవీ, పచ్చవీ చంద్రకాంతపూలు వికసించాయి. ఎండలో వాడిలిన గోగుపూలు సాయంత్రపుగాలిలో ప్రాణాల్ని నింపుకుంటున్నాయి. కొట్టంముందు కట్టిన ఆవులు నన్ను చూసి మెడలు చాస్తున్నాయి. వుండుండి అంబాఅని పిలుపు వినపడుతోంది. రాత్రి శాంతి అప్పుడే భూమినావరించింది. దుర్గమ్మ వొక్కత్తా గోగుచెట్లనడుమ, దిగులుగా నుంచుని, ఒక్కొక్క ఆకే వొళ్ళో వేసుకుంటోంది నా హృదయంలో అపరిమితమైన దిగులు ఆవరించింది. ఆమెదగ్గిరికి వెళ్ళి

"ఏం కొత్తమచ్చలు లేవూ ?" అన్నాను.

సిగ్గుపడక, చిన్న నవ్వుతో "లేవండీ" అంది.

నా మనసులో కొత్తవికారం వుదయించింది. భార్య యింట్లో లేకపోవడమే కారణమనుకుంటూ ఇంకా దగ్గిరిగా అడుగువేసి, కొంటెగా, "కొత్తమచ్చలు లేనే లేవా ?" అన్నాను మళ్ళీ.

"ఉంటే, కనపడవు" అంది ధైర్యంగా.

"కనపడనిచోట్ల వున్నాయా ?"

కళ్ళూ తలా తిప్పేసింది. ఆ నిమషాన ఆ పిల్లమీద నిష్కారణమైన జాలీ, వున్నతమైన ప్రేమా కలిగాయి. ఆ

చూపులో యితరుల సహాయం అడిగే జాలివుంది. నేను చెయ్యగల సహాయం ఒకటే కనపడ్డది నాకు. ఆ సమయాన ప్రేమకీ, కామానికీ, జాలికీ ఎంత సన్నిహితమో! మోకాళ్ళ వరకు ఎగదీసి కట్టిన ఆమె చీరా, రొమ్ముని దాచడానికి శ్రమపడే ఆ రవికా, గాలిలో ఊగుతున్న ఆమె జుట్టూ, నన్ను వెళ్ళిపోనీక ఆటంకపెట్టాయి. ఈ గోంగూర ఒక్కొక్క ఆకే కోసి, పరి, వొండి, ఆ చీకటి బూజుయింటో, ఆ మూల, ఆ ముంగి వెధవకి తినిపిస్తుంది. ఒక్క ఆకినా మిగల్చక తిని, యీమె వంక తలెత్తి చూడక లేచిపోతాడు వాడు. నా హృదయంలోని ఆ కరుణా భావాన్ని భరించలేకపోయినాను. ఎట్లా సంతోషమివ్వగలను. ఆ బేలహృదయానికి: "మచ్చ లేవి? చూడని" అని ఆమె బుజం మీది రవికను పక్కగా లాగాను. దుర్గమ్మ మెల్లిగా నా వేళ్ళను తొలిగించి మళ్ళా కప్పుకున్నది. అదే పట్టుదలతో రెండో చేతి పక్కన చూశాను.

"అక్కడో పెద్ద మచ్చవుంది. ఇంకా కొంచెం కిందగా యెత్తుగా మొదలు పెట్టేచోట యింకో మచ్చవుంది. "పాపం, దుర్గమ్మా!" అని ఆమె తలని నా రొమ్ముకి అద్దుకున్నాను.

"ఎందుకు నా మచ్చలజోలి నీకు? ఎప్పుడూ నవ్వుతావు? వొళ్ళంతా అవే." అని మోకాలిమీద చీరెతీసి చూపింది. నేను చప్పున యింకా పైకిలాగి "ఇంకా లేవా?" అన్నాను. తలయెత్తి నా వంక తెల్లబోయి చూస్తోనుంచుంది. ఎర్రని పడమటికాంతి ఆమె కళ్ళమీద మెరిసింది. నేను ఆమె బుజాల్ని పట్టుకుని వొంచబోయినాను. అప్పుడు కలిగింది జ్ఞానం ఆ అమాయపు కళ్ళల్లో. భయంతో— వణుకుతో—

ఆచిన్న మొహం-కాలిపోతున్న ఆచిన్న మొహం——చెప్పలేను ఆ బాధ మెడకాయి తెగుతున్న కోడికళ్ళలోకి వొచ్చే చూపు—

"నీకు చెల్లెల్ని, అన్నయ్యా, కొరక్కు—ఆ పని తగదు నీకు, నన్ను కొరక్కు. నీకు ఆ బుద్ధి కూడదు నీ కాళ్ళు పట్టుకుంటా, కొరక్కు" అని సన్నగా కీచుమని అరిచింది.

నా మొహం పటాపంచలయింది. భరించలేని సిగ్గుతో, జాలితో, ఆశ్చర్యంతో వెళ్లిపోయినాను. నామీద, నాకామంమీద, పరమ అసహ్యం కలిగింది. ఆ నాటినించి యింత వరకు పరాయి ఆడదాన్ని తాకలేదు. ఆచూపు నన్ను దయ్యం వలె వెంట తిరుముతోంది. ఆకళ్ళు, దీనమైన ఆకళ్ళు- ఎవరితోను చెప్పుకోలేని బాధతో కుంగిపోయిన ఆపాపలు రక్త ధారలు కార్చిన ఆ పాపలు- బొగ్గైపోతున్నాయి. తననే కాకుండా, లోకాన్నంతా నాకు చెల్లెళ్ళని చేసింది దుర్గమ్మ. తల్లి కాలిపోతోంది.

ఆలోచించాను, కొరకవొద్దని అరిచిందేమిటి? ప్రేమ అన్నా, లాలన అన్నా, దుర్గమ్మకి కొరకడంతో ప్రారంభమని అభిప్రాయం. వాడూ ఆరత్తయ్యకారణం. వాణ్ణి వెళ్లి "ఇదేం, రోగంరా!" అని తందామనుకున్నాను. కాని నాకెట్లా తెలిసిందని వాడనుమానపడడా? వాడి భార్యమీద అట్లాంటి కోర్కెపడి, పైగా వాణ్ణి యామని తన్నను? ఏంచెయ్యను? దుర్గమ్మని వొచ్చేసి మాయింటో వుండమంటే, పారి పొమ్మంటే, లేక నేను యెక్కడన్నా ఆమెని కాపరం పెడితే,

ఇట్లాంటి చాతకాని ఆలోచనల్ని చూసి నేనే నవ్వు కున్నాను.

దుర్గమ్మ మాయింటికిఇంకరాలేదు. ఒక్కసారి ఆమెతో మాట్లాడాలని వుంది. నాభార్య నెలరోజులయిం తరవాత వొచ్చింది పుట్టింటినించి. రాగానే ఆమెచాత కబురంపి పిలి పించాను దుర్గమ్మని.

"దుర్గమ్మా, రత్తయ్య రాక్షసి. నువ్వా బాధలు పడ లేవు. ఎక్కడికన్నా వెళ్లు. నేను సహాయంచేస్తాను."

"నేనా? ఎక్కడికన్నా వెళ్ళనా? సంసారం వొదలు కుని! మంచిమాటలు మాట్లాడుతున్నారు. నేనెందుకు వెళ్లాలి?" అని ఒక్కవిసురున వెళ్ళిపోయింది.

నాకు దుర్గమ్మమీద కోపం వచ్చింది. సహాయం చెయ్యపోతే యిదీ! కాని నేను ప్రయత్నించిన దుర్మార్గమూ, ఆమె విశ్వాసాన్ని పోగొట్టుకున్న సమాచారమూ చక్కగా మరిచిపోయినాను.

రత్తయ్యమీద వూరంతా పుకార్లుగా వున్నాయి. అత నికిపిచ్చెత్తిందంటున్నారు కొందరు. ఇద్దరు ముగ్గురు యీడిగఆడ వాళ్ళని వెంబడించి బలవంతం చేసి పట్టుకుని కరవబోతే, దొంగఅనుకుని తన్నారుట. దుర్గమ్మ రెండుసార్లు యింటోంచి పారిపోతే వూరివాళ్ళు లాక్కొచ్చి దిగడ్చారు. ఈ సంగతు లన్నీ వింటున్నా నేను జోక్యం కలగచేసుకోలేదు. నాకేం ? ఆడది తృణీకరించింతరవాత మళ్ళీ ఆమె క్షేమం కనుక్కుం టానా ? అని అభిమానపడ్డాను.

ఒకరోజు రాత్రి నాపడక గదితలుపు కొట్టారు యెవరో. తెరిస్తే లోపలికి వొచ్చింది దుర్గమ్మ. నా భార్య పందిరిపట్టె మంచంమీద, చామంతిపూలతో, పట్టు దిండుమీద తలపెట్టుకుని నిద్రపోతోంది. నేను కుర్చీలో పడుకుని, పతివ్రతలకథలు చదువుకుంటున్నాను. కొత్తగాపుట్టిన మా పాప వాడిఅమ్మమ్మ యిచ్చిన వుయ్యాలతొట్టెలో పడుకుని, దీపంకేసి చేతులుజాచి వూంకొడుతున్నాడు. సాంబ్రాణి వొత్తులు కొసవరకూ వెలుగుతున్నాయి. మా గదినీ, మా సౌభాగ్యాన్నీ గావును చూస్తో నుంచుంది దుర్గమ్మ.

“ఈరాత్రికి, మీ యింటో ... ఆ వసారాలో ... యెక్కడైనా సరే పడుకోనియ్యండి” అంది కష్టంగా.

కారణం తెలుసుకోవాలనే ప్రబలమైన నా కోర్కెని దిగమింగుకుని,

“దానికేం? పడుకో. మీ యింటో వీలులేదా?” అన్నాను. గుడ్లనీళ్లు కుక్కుకుని మాట్లాడలేదు. వరండాలో మంచం జంపకానా వేసి పడుకోమన్నాను. నా వెంటవొచ్చి మంచంమీద కూచుని, వెళ్ళబోయ్యే నా చెయ్యి పట్టుకుని, కళ్ళనద్దుకుని వెక్కివెక్కి యేడ్చింది. కాని ఏమీ మాటాడదు, ఎంత అడిగినా—

“నిర్భాగ్యురాలిని. నాసంగతెందుకు-వెళ్ళి పడుకోండి” అంటుంది. ఏం చెయ్యను?

జీవితంలోని దురదృష్టవంతులు, మన పక్కనేవుంటారు, మనలోనే, స్నేహంగా తిరుగుతోవుంటారు. బాధపడుతో గాయాలు పడుతో, మన కళ్లయెదటనే అకాలమృత్యువు వేపు

నడుస్తోవుంటారు. మనం గుర్తించం. గుర్తించినా, మన ఆనందం లోంచి తప్పుకుని వాళ్ళకోసం చెయ్యి జాచము. జాచినా, సహాయాన్ని తీసుకోరు. సహాయం చెయ్యలేము. నిస్సహాయులము. సహాయం తీస్కుకోడం వారి చాతకాదు. దౌర్భాగ్యులు, నిస్సహాయులు, విచిత్రమైన లోకం—భయంకరమైన జీవితం—

"నేను కష్టపెట్టి, నలగకొట్టతలుచుకున్న వాళ్లకి నువ్వా, ఓరి అల్పుడా, నువ్వా, సహాయంచేసేది! కానీ!" అని మొహాన నవ్వినట్టుంటుంది, యెవరో రాక్షసి!

తెల్లవారి నేను లేచేముందే వెళ్లిపోయింది.

రెండురోజులతరవాత ఒకనాటి మధ్యాన్నం, నేను వసారాలో పడుకుని అబ్బాయిని గిలిగింతులు పెట్టి నవ్విస్తూ వుండగా, దుర్గమ్మవొచ్చి మంచంపక్కన కూచుంది.

"అన్నయ్యా! ఆనాడు నన్నెక్కడికన్నా పొమ్మన్నారే! పోతాను. ఎక్కడికి పోను?"

అన్నానన్నమాటే గాని ఎక్కడికి పంపను?

"మీఅమ్మదగ్గిరికో, అన్నయ్యదగ్గిరికో వెళ్ళకూడదా?"

"అయింది. మళ్లీ లాక్కొచ్చాడు."

మాయింటో వుండమనడానికి ధైర్యంలేదు. రత్తయ్యవొచ్చి గోలచేస్తే మానాయన వొప్పుకోడు. నేను మాత్రం అపవాదు పడగలనా?

"ఎక్కడన్నా నేను వుంచుతాను, యీవూళ్ళో."

"బతకనీడు."

"ఇంకేం చెయ్యను?"

ఆలోచించాను. ఏమీ తోచలేదు. ఎందుకు నన్నిట్లా బాధపెడు తుంది! పోదేమో అనిపించింది. ఆమె బట్టలూ, వొళ్లూ, భరించలేని వాసన వేస్తున్నాయి. నాపిల్లవాడి కక్కుడే పట్టుకుంటుందో ఆమెనించి రోగం.

“సరకే, చూస్తాలే, దుర్గమ్మా, వెళ్లు.”

కాళ్ళీడ్చుకుంటో వెళ్ళింది. అప్పుడన్నా నాకర్థంకాలేదు ఆమె బాధ బరువు.

తెల్లవారేటప్పటికి చచ్చివుంది. రాత్రంతా ఆమె కేకలు మూలుగులు విన్నవాళ్ళే అంతా, ఒక్కరూ కదల్లేదు. కిటికీలూ, తలుపులూ, చెవులూ, మనసులూ, బిగించుకుని హాయిగా పడుకున్నారు. ఏం జరిగిందో ఎవరికన్నా తెలుస్తుందా? ఎవరు చెపుతారు? వాడా? వాడేమీ చెప్పడు. చెప్పినా అబద్ధాలు. ఆ కాలిపోయిన పెదిమలు యిదివరకు చెప్పలేదు. ఇంక చెప్పవు.